నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 15 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

18న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దవూర, డిసెంబర్ 14 : 2025 – 26 విద్యా సంవత్సరానికి గానూ మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షను జిల్లా విద్యాధికారులు నిర్ణయించిన కేంద్రాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే 9448983776ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు
కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 14 : ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్– 2 పరీక్షల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ – 2 పరీక్ష సందర్భంగా జిల్లా అధికారులు విధులు నిర్వహిస్తున్నందున కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు గమనించి సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని సూచించారు.

మా భూములు మాకేనని..!

యాదాద్రి భువనగిరి జిల్లా రైతులు తమ భూములను కాపాడుకునేందుకు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. జిల్లాలో ఓ వైపు ట్రిపుల్ ఆర్ బాధితులు వెనకడుగు వేయకుండా పోరు సల్పుతున్నారు. మరోవైపు గౌరెల్లి–భద్రాచలం జాతీయ రహదారి కోసం ప్రభుత్వానికి భూములు ఇచ్చేది లేదంటూ ఉద్యమ బాట పడుతున్నారు. సర్కారు మాత్రం రైతుల డిమాండ్లు పట్టించుకోకుండా భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నది.

- యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ)

సర్కారుపై మర్లవడుతున్న రైతాంగం
భూములను కాపాడుకునేందుకు పోరుబాట

- ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల అలుపెరుగని ఉద్యమం
- ఇటు భువనగిరి.. అటు చౌటుప్పల్‌లో రణం
- నిత్యం ధర్నాలు, నిరసనలు, వినతి పత్రాల అందజేత
- గౌరెల్లి -భద్రాచలం హైవే నిర్వాసితుల ఆందోళనలు
- ఎట్టిపరిస్థితుల్లోనూ భూములు ఇవ్వబోమని వెల్లడి
- ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా ముందుకే..

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గౌరెల్లి –భద్రాచలం హైవే నిర్వాసితులు (ఫైల్)

సుదీర్ఘ కాలంగా 'భువనగిరి' రైతుల పోరు..

ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించారు. ఉత్తర భాగంలో జిల్లా మీదుగా 59.33 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించనున్నారు. దీని పరిధిలో తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలు ఉన్నాయి. రహదారి నిర్మాణం కోసం సుమారు 2వేల ఎకరాల భూమిని సేకరించనున్నారు. భువనగిరి మండలంలోని గౌస్‌నగర్, కేసారం, యెర్రంబెల్లి, తుక్కాపూర్, పెంచికల్‌పహాడ్, రాయగిరి గ్రామాల్లో భూమిని తీసుకోనున్నారు. ముఖ్యంగా రాయగిరి రైతులు తమ భూములను కోల్పోతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంత రైతులు పలు సందర్భాల్లో తమ భూములను కోల్పోవాల్సి వచ్చింది. వైటీడీఏ విస్తరణ, హైటెన్షన్ వైర్లు, జాతీయ రహదారి నిర్మాణం సమయంలో భూములను ప్రభుత్వానికి అప్పగించాల్సి వచ్చింది. ఇప్పుడు మళ్లీ ఇక్కడి నుంచే ట్రిపుల్ ఆర్ రోడ్డు వెళ్తుండడంతో మిగిలిన కొద్దిపాటి భూమిని కూడా సర్కారు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి భూములు ఇచ్చేది లేదని రాయగిరి రైతులు నాలుగేండ్లుగా రణం చేస్తున్నారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నా ఆ తర్వాత స్టే వెకేట్ అయ్యింది.

నిత్యం పోరుబాటే..

ప్రభుత్వానికి భూములు ఇచ్చేది లేదని రైతులు భీష్మించి కూర్చున్నారు. ఆ మేరకు నిత్యం ఆందోళనలు చేస్తున్నారు. సమావేశాలు, రౌండ్ టేబుల్ మీటింగ్, చర్చ గోష్ఠిలు నిర్వహిస్తున్నారు. భువనగిరి, చౌటుప్పల్ మండలాలు భూ నిర్వాసితులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు అందరినీ కలుస్తున్నారు. అధికారులు, అధికారం, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలుస్తూ తమ గోడు వెల్లబోసుకుటున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఇదే సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా చౌటుప్పల్‌లో సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. ఇటీవల గౌరెల్లి – భద్రాచలం హైవే నిర్వాసితులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నారు.

ఆందోళనలో గౌరెల్లి -భద్రాచలం హైవే నిర్వాసితులు..

రంగారెడ్డి జిల్లా గౌరెల్లి నుంచి భద్రాది కొత్తగూడెం వరకు జాతీయ రహదారి 930 నిర్మిస్తున్నారు. భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, మోత్కూర్, అడ్డగూడూరు మీదుగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ నుంచి భద్రాది కొత్తగూడెం వరకు జాతీయ రహదారి వేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని చౌటుప్పల్ డివిజన్ పరిధిలో గల వలిగొండ, భూదాన్ పోచంపల్లి మండలాల్లో భూ సేకరణ చేయనున్నారు. జిల్లాలో సుమారు 42 కిలోమీటర్ల మేర కొత్త రోడ్డును నిర్మించనున్నారు. ఇప్పటికే అధికారులు నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. రైతుల నుంచి వినతులు, అభ్యంతరాలు స్వీకరించారు.

చౌటుప్పల్ ట్రిపుల్ ఆర్ జంక్షన్‌పై ఉద్యమం

చౌటుప్పల్ పట్టణానికి ఆనుకుని తూర్పు వైపున హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపైన రీజినల్ రింగ్ రోడ్డులో ఉత్తర, దక్షిణ భాగాలు కలిపే జంక్షన్‌ను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలో చౌటుప్పల్ వద్ద తలపెట్టిన జంక్షన్ విస్తరణను భారీగా పెంచింది. కొత్త అలైన్‌మెంట్‌తో చౌటుప్పల్ పట్టణం రెండుగా చీలనున్నది. రెండున్నర రెట్లు అధికంగా రైతుల భూములను కోల్పోవల్సి వస్తున్నది. ఏండ్ల తరబడి వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న రైతులు రీజినల్ రింగ్ రోడ్డుకు తమ భూములు తీసుకుంటే రోడ్డున పడుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలైన్‌మెంట్ మార్చాలని, లేదా బహిరంగ మార్కెట్లో ఉన్న ధరను అనుసరించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భూమికి బదులు భూమి ఇవ్వాలని పట్టుపడుతున్నారు.

ఇటీవల చౌటుప్పల్ పరిధిలో తంగడపల్లివద్ద ట్రిపుల్ ఆర్ సర్వేను అడ్డుకుంటున్న రైతులు

ప్రభుత్వం మాత్రం ముందుకే...

వేలాది మంది రైతులు ఉద్యమ బాట పడుతుంటే.. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. భూ నిర్వాసితుల గోడును పెడ చెవిన పెడుతున్నది. ట్రిపుల్ ఆర్‌లో భాగంగా ఇప్పటికే ట్రీడీ, త్రీజీ నోటిఫికేషన్లు విడుదల చేసింది. రాయగిరి రైతులు కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకోగా విశ్వ ప్రయత్నాలు చేసి వెకేట్ చేయించేలా చర్యలు తీసుకున్నది. అవసరమైతే కొంతమేర పరిహారం పెంచే పనిలో ఉన్నట్టు తెలుస్తున్నది. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని కోరిన విషయం తెలిసిందే.

ప్రాణాలు పోయినా భూములివ్వం

మా దగ్గర ఇప్పటికే నాలుగైదు సార్లు భూములను కోల్పోయాం. కోట్ల రూపాయల విలువ చేసే భూములను అప్పనంగా ఎలా ఇస్తాం? ఎన్నికల సమయంలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పుడు అదే ప్రభుత్వం భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏకంగా భూ సేకరణ పూర్తయ్యిందని కేంద్రానికి అబద్ధాలు చెప్తున్నారు. ప్రాణాలు పోయినా మా భూములు ఇవ్వం.

- పాండు, ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుడు, రాయగిరి

భూమి ఇచ్చేదే లేదు

మాకు వ్యవసాయమే జీవనాధారం. తాతల నుంచి భూమిని నమ్ముకుని బతుకుతున్నాం. నాకున్న నాలుగెకరాలు ట్రిబుల్ ఆర్ జంక్షన్ అలైన్‌మెంట్‌లో పోతున్నది. ఏ మాత్రమూ మిగలడం లేదు. భూమి మొత్తం పోతే ఎట్లా బతకాలి. ఇంతకు ముందు అధికారులు ఆధార్‌కార్డు, పాస్‌బుక్ అడిగితే ఇవ్వలేదు. సర్వే కూడా చెయ్యనివ్వలేదు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ఇస్తే భూమి ఇస్తాం. లేదంటే భూమికి బదులు భూమి ఇవ్వాలి.

-జాల జంగయ్య యాదవ్, రైతు, చౌటుప్పల్

అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదు

ప్రభుత్వం గౌరెల్లి నుంచి భద్రాచలం మీదుగా చత్తీస్‌గడ్ వరకు నిర్మిస్తున్న హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి. ఆ తర్వాతే భూముల జోలికి రావాలి. భూమితోనే మాకు బతుదెరువు. ఉన్న భూమి కాస్త రోడ్డు కోసమని ప్రభుత్వం తీసుకుంటే మేమెట్లా బతుకాలి. నామమాత్రం ధర చెల్లించి భూములను గుంజుకుంటామంటే ఊరుకునేదే లేదు. న్యాయమైన ధర కోసం సమైక్యంగా పోరాటం చేస్తాం. అన్యాయంగా భూములు గుంజుకునే ప్రయత్నం చేస్తే ప్రజా తిరుగుబాటు తప్పదు.

- భీమనబోయిన జంగయ్య, సంగెం గ్రామం (వలిగొండ మండలం)

పత్తి మిల్లులో అగ్నిప్రమాదం

ఆలేరు టౌన్, డిసెంబర్ 14 : యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు పట్టణంలో గల శ్రీమల్లికార్జున స్వామి కాటన్ ఇండస్ట్రీలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఎగిసి పడడంతో షెడ్లలో ఉన్న దాదాపు 300 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. మరికొంత పత్తి పొగ చూరడంతో పనికి రాకుండా పోయింది. ఆలేరు అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలను ఆర్పేశారు.

పత్తి నిల్వ చేసిన షెడ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు వచ్చి పత్తి కుప్పలపై పడడంతో ప్రమాదం జరిగిందని మిల్లు యాజమాన్యం చెప్తున్నది. సుమారు రూ.30లక్షల నష్టం వాటిల్లినట్లు వాపోయింది.

పత్తి మిల్లులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నందికొండకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు : బీఆర్ఎస్

నందికొండ, డిసెంబర్ 14 : కాంగ్రెస్ పాలన వచ్చి సంవత్సరం అయినా నందికొండ మున్సిపాలిటీకి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ పార్టీకి చెందిన 5వ వార్డు కౌన్సిలర్ రమేశ్‌జీ అన్నారు. నందికొండ మున్సిపాలిటీని తీసివేయడానికి కాంగ్రెస్ స్థానిక నాయకులు కుట్రలు చేసున్నారని శనివారం హిల్‌కాలనీలోని ఇందిరమ్మ కూడలి వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్‌జీ మాట్లాడుతూ నాగార్జునసాగర్‌ను నందికొండ మున్సిపాలిటీగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. మున్సిపాలిటీగా చేయడం వల్లే సుమారు రూ.200 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అమృత్ పథకం కింద రూ.44 కోట్లు మంజూరయ్యాయని, ఆ పనులనే ఎమ్మెలే జయవీర్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. నందికొండ మున్సిపాలిటీ కావడంతోనే నిధులు వచ్చాయనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు. సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం నందికొండ మున్సిపాలిటీకి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన నిధులతోనే కాంగ్రెస్ నాయకులు పనులు చేస్తున్నారన్నారు. స్థానిక నాయకుల అసమర్థత వల్ల వచ్చిన నిధులు కూడా కొన్ని వెనక్కి పోయాయని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో 58, 59 జీఓల కింద నివాస గృహాలను నివాసం ఉంటున్న వారికి సొంతం చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇండ్లు సొంతం చేయకపోగా.. 10 సంవత్సరాలకు పైగా వసూలు చేయని బకాయిలను వసూలు చేస్తున్నారని తెలిపారు. నందికొండ మున్సిపాలిటీని తొలగించాలనే ఆలోచనను కాంగ్రెస్ నాయకులు మానుకోవాలన్నారు. లేకపోతే నిరసనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌస్, లక్ష్మణ్‌నాయక్, మంద శాంతకుమారి, శేఖరాచారి, సైదులు, యేసు, కొండల్ పాల్గొన్నారు.

హిల్‌కాలనీలో ఇందిరమ్మ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

రాజీపడిన కక్షిదారులకు డిగ్రీలను అందిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

సత్వర న్యాయానికి లోక్ అదాలత్ దోహదం

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

రామగిరి, డిసెంబర్ 14 : రాజీ మార్గమే.. రాజ మార్గమని, ఆ దిశగా కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లు దోహదం చేస్తాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. నల్లగొండ కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 13 అదాలత్ బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో తీర్పు వస్తే తిరిగి అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఉండదని, ఇదే అంతిమ తీర్పు అవుతుందని చెప్పారు. రాజీపడదగిన క్రిమినల్, సివిల్ కేసులతోపాటు అన్ని రకాల కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవచ్చన్నారు. అనంతరం రాజీపడిన కేసులోని కక్షిదారులకు డిగ్రీలను ఆయన అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి డి.తేజోకార్తీక్, న్యాయమూర్తులు దుర్గాప్రసాద్, కె.కవిత, శిరీష, సౌందర్య, డిఫెన్స్ న్యాయవాదులు ఎన్.భీమార్జున్‌రెడ్డి, లేనిన్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు పందిళ్లపల్లి బ్రహ్మాచారి, శ్రీనివాసచక్రవర్తి, ప్రమీల, ఎ.వెంకట్‌రెడ్డి, ప్యానల్ న్యాయవాదులు, కక్షిదారులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

1,44,358 కేసుల పరిష్కారం

లోక్ అదాలత్‌లో 72 సివిల్, 4,787 క్రిమినల్, 86 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 9 బ్యాంక్ కేసులు, 15 సైబర్ క్రైం, 230 ట్రాన్స్‌పోర్టు, 9,251 ట్రాఫిక్ చలాన్లు.. మొత్తం 1,44,358 పెండింగ్ అండ్ ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెల్లడించారు. ప్రమాద బీమా కేసుల్లో రూ.4,09,38,000 నష్టపరిహారం ఇప్పించగా.. బ్యాంకు కేసుల్లో రూ.3,55,000 రుణ పరిహారం ఇప్పించినట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ కేసులో 1,14,385 రూపాయలు రికవరీ చేసి అందజేశారు.

గ్రూప్–2 పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

- నేడు, రేపు రెండు సెషన్లలో నిర్వహణ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 52,109మంది అభ్యర్థులు
- నల్లగొండకు వచ్చిన టీజీపీఎస్‌సీ ప్రత్యేక పరిశీలకులు

రామగిరి, డిసెంబర్ 14 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. ఆది, సోమవారాల్లో రెండు సెషన్లలో నిర్వహించే పరీక్షలకు ఆయా జిల్లాల అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52,109 మంది అభ్యర్థులు హాజరు కానుండగా.. వారి కోసం 150 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 9:30కు, మధ్యాహ్నం 2:30గంటల వరకు అభ్యర్థులను అనుమతిస్తారు. అరగంట ముందే గేట్లు మూసివేయనున్నారు. ఈ క్రమంలో అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరు తీసుకోనున్నారు.

జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలు, అభ్యర్థుల వివరాలు..

- నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా కేంద్రంలో 59కేంద్రాల్లో 21,225 మంది పరీక్ష రాయనున్నారు. మిర్యాలగూడలోని 28 పరీక్ష కేంద్రాల్లో 7,949మంది హాజరు కానున్నారు. పరీక్షల పరీశీలనకు టీజీపీఎస్‌సీ ప్రత్యేక పరిశీలకులుగా శ్రీధర్, యాదగిరి, శివారెడ్డి వచ్చారు.
- సూర్యాపేట జిల్లాలో మొత్తం 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సూర్యాపేటలో 30, కోదాడలో 19 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 16,857మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 8,074మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

గ్రూప్-2 పరీక్ష కేంద్రం పరిశీలన

భువనగిరి అర్బన్, డిసెంబర్ 14 : పట్టణంలోని లక్ష్మీనర్సింహస్వామి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్–2 పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని కళాశాల సిబ్బందికి సూచించారు. ఆర్డీఓ కృష్ణారెడ్డి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి

ప్రజా పాలన కాదు.. ప్రతీకార పాలన

- రాజకీయ దురుద్దేశంతోనే తెలంగాణ తల్లి రూపు మార్పు
- బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి

హుజూర్‌నగర్, డిసెంబర్ 14 : రాష్ట్రంలో ప్రజా పరిపాలన కాకుండా ప్రతీకార పాలన సాగుతున్నదని బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పరిపాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణ నేడు రైతుల ఆత్మహత్యలతో అల్లాడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ మొదలు పెట్టిందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ సరిగ్గా అమలు చేయకుండా సిగ్గు లేకుండా సంబురాలను చేసుకుంటున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పేరు మార్చి బ్యాగుల, తొండలరెడ్డి పేరు పెట్టుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపును రాజకీయ దురుద్దేశంతోనే మార్చారని మండిపడ్డారు. సినీ పరిశ్రమలో కాంగ్రెస్‌కు మద్దతు లభించక పోవడంతో వారిని భయపెట్టేందుకే అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి ప్రభుత్వం తప్పిదం చేసిందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనపైన ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారని, తిరుగబడే రోజులు దగ్గర్లో ఉన్నాయని హెచ్చరించారు. హుజూర్‌నగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామన్నారు. బతుకమ్మ మన సంస్కృతి కాదంటూ.. అది అగ్రకులాలకే పరిమితమని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనడం వారి అహంకార ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ అప్పిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు కేఎల్ఎన్ రెడ్డి, అప్పిరెడ్డి, బెల్లకొండ అమర్, పచ్చిపాల ఉపేందర్, నగేశ్, బాలాజీనాయక్, చంద్రమౌళి, అబ్దుల్ నబీ, భిక్షం, ములకపల్లి రాంబాబు పాల్గొన్నారు.